ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం: 27.0 కనిష్ఠం: 22.0
ANDHRAJYOTHY
5
నారాయణపేట
జిల్లా వార్తలు
సోమవారం 8 సెప్టెంబరు 2025



అనుమానం, భూ తగాదాలే
హత్యకు కారణం
● కన్న తండ్రిని దారుణంగా చంపిన కొడుకు
● 24 గంటల్లో ఇద్దరు నిందితుల అరెస్టు 7

అబాస్‌కు విముఖం

హాజరు నమోదు ప్రత్యేక యాప్‌ను వ్యతిరేకిస్తున్న వైద్య ఉద్యోగులు

- 40 శాతం కూడా దాటని హాజరు
- మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో కొంత మెరుగు



మహబూబ్‌నగర్ మండలం మనికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ముఖం చూపించి హాజరు వేసుకుంటున్న మెడికల్ ఆఫీసర్

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టమ్ (అబాస్)కు వైద్య ఉద్యోగులు విముఖత వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది సమయానికి రారని, సకాలంలో వైద్యసేవలు అందవనే అభిప్రాయం ప్రజల్లో ఎప్పటి నుంచో ఉంది. ఆ అభిప్రాయాన్ని తొలగించి ప్రజల్లో నమ్మకం కలిగించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అబాస్ విధానాన్ని అమలులోకి తెచ్చింది. దీని ప్రకారం సకాలంలో ఆసుపత్రికి వచ్చి 'అబాస్'లో ముఖ గుర్తింపు పొందితేనే హాజరు నమోదవుతుంది. లేకపోతే ఆ రోజు విధులకు హాజరు కానట్లే లెక్క. కానీ ఈ విధానాన్ని ఉద్యోగులు ఇష్టపడటం లేదు. ప్రతీ రోజు హాజరు 40 శాతం కూడా దాటడం లేదు. ప్రధానంగా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ఉద్యోగులు ఈ విధానాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. అయితే ఆయా ఆసుపత్రుల సూపరింటెండెంట్లు పట్టించుకోకపోవడంతో ఆ విధానం సక్రమంగా అమలు కావడం లేదు.

ఈ నెల 1 నుంచి అమలు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా అబాస్ విధానాన్ని ఈనెల 1 నుంచి అమలు చేస్తున్నారు. వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆసుపత్రుల్లో పని చేస్తున్న అన్ని విభాగాల వైద్యులు, ఉద్యోగులు, సిబ్బంది తాము పని చేస్తున్న ఆసుపత్రులకు సకాలంలో వెళ్లి మొబైల్ యాప్‌లో ముఖం చూపించి హాజరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఆసుపత్రి ఆవరణలో 100 మీటర్ల దూరం వరకే ఈ యాప్ పని చేస్తుంది. దీంతో వారు విధులకు ఎన్ని గంటలకు వచ్చారు, ఎన్ని గంటలకు వెళ్లిపోయారు అనే విషయం స్పష్టంగా తెలుస్తోంది. దీని ప్రకారమే వారి హాజరును పరిగణనలోకి తీసుకుంటారు.

ముందుకు రాని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

అబాస్ ప్రకారం హాజరు వేయడానికి ఉమ్మడి జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు ముందుకు రావడం లేదు. 5 జిల్లాల్లో కలిపి దాదాపు 3,500 మంది వరకు ఉద్యోగులు ఉన్నప్పటికీ, వారిలో వెయ్యి మంది కూడా తమ వివరాలను నమోదు చేసుకోలేదు. వారిలోనూ సగం మంది వరకు అబాస్ ప్రకారం హాజరు వేయడం లేదు. పైగా తమ యూనియన్ ఆ అబాస్‌కు వ్యతిరేకం అని, తమకు ఎలాంటి అనుమతులు రాలేదని దబాయిస్తున్నారు. గతంలో బయోమెట్రిక్ విధానాన్ని అమల్లోకి చేసినప్పుడు కూడా వారు ఇదే తరహాలో వ్యతిరేకించారు. కొన్ని చోట్ల బయోమెట్రిక్ యంత్రాలను ధ్వంసం చేసిన సంఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం అబాస్ విధానాన్ని కూడా వ్యతిరేకిస్తున్నారు. ఈ విధానాన్ని తొలగించాలని రాష్ట్రవ్యాప్తంగా డీఎంఅండ్‌హెచ్‌వోలకు వినతి పత్రాలు కూడా సమర్పించారు. అయితే డీఎంఈ పరిధిలోని ఆసుపత్రుల్లో మాత్రం 60 నుంచి 70 శాతం హాజరు నమోదవుతోంది. ఎందుకంటే ఆ ఉద్యోగుల డాటా ఎన్ఎంసీతో అనుసంధానం అయ్యి ఉండడంతో ఎక్కువ మంది

(మిగతా 7లో..)

ఉమ్మడి జిల్లా పరిధిలో 'అబాస్' అమలు తీరు

జిల్లా	డీఎంఈ	హాజరు	వైద్య ఆరోగ్యశాఖ	హాజరు	వైద్య విధాన పరిషత్	హాజరు
మహబూబ్‌నగర్	869	441	313	65	96	62
గద్వాల	164	77	167	84	101	54
వనపర్తి	400	58	323	178	352	104
నారాయణపేట	146	58	321	176	137	75
నాగర్‌కర్నూల్	0	0	259	79	215	96
మొత్తం	1,579	634	1,383	582	901	391

తూకంలో తకరారు



రేషన్ దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

- ఒక్కో రేషన్ కార్డుపై 3 నుంచి 9 కిలోల బియ్యం కట్
- తూకంలో 3 కిలోలు.. కార్డు కోటాలో ఒక లబ్ధిదారుడి బియ్యం స్వాహా
- మహబూబ్‌నగర్‌లోని ఓ దుకాణంలో వెలుగు

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లు తూకంలో మోసాలకు పాల్పడుతూ, వినియోగదారులను నిలువునా ముంచుతున్నారు. పాలమూరు కార్పొరేషన్ పరిధిలోని ఓ రేషన్ దుకాణంలో జరుగుతున్న బాగోతాన్ని పసిగట్టిన వినియోగదారులు అతన్ని నిలదీయడంతో పాటు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విచారణ చేసిన అధికారులు అతడిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నగరంలోని పద్మావతీ కాలనీ రేషన్ దుకాణంలో ఆదివారం బియ్యం ఇచ్చారు. కొత్తగా రేషన్ కార్డు మంజూరైన జి.నర్సింహులు బియ్యం తీసుకోడానికి వెళ్లారు. కార్డులో ఆరుగురు కుటుంబ సభ్యులుండగా ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున వారికి 36 కిలోల బియ్యం ఇవ్వాల్సి ఉంది. కానీ డీలర్ 27 కిలోలు మాత్రమే తూకం చేశాడు. తమకు 36 కిలోలు రావాలి కదా అని నర్సింహులు ప్రశ్నించాడు. కార్డులో ఇంకా ఒకరికి కోటా రాలేదని, అందుకే 30 కిలోలు ఇస్తున్నామని బదులిచ్చాడు. 30 కిలోలు కూడా లేవని అనుమానం వచ్చిన సదరు వినియోగదారుడు పక్క దుకాణం వద్దకు వెళ్లి తూకం చేసిన చూడగా 27 కిలోలు మాత్రమే ఉన్నాయి. మళ్లీ దుకాణం వద్దకు వెళ్లి బియ్యం తీసుకున్న మిగతా వినియోగదారులను అడగగా అందరి కార్డులలో ఒక్కొక్కరి కోటా తక్కువగా ఇస్తున్నట్లు చెప్పారు. దాంతో అతను వెంటనే అర్బన్ తహసీల్దార్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. టాస్క్‌ఫోర్స్ టీటీ రాజీవ్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు అక్కడికి చేరుకుని బియ్యాన్ని మరో మిషన్ ద్వారా తూకం చేయగా 27 కిలోలు మాత్రమే వచ్చింది.

కిలోకు 100 గ్రాములు కోత

ఒక్కో కిలోకు 900 గ్రామాల బియ్యం మాత్రమే వచ్చేలా మిషన్ సెట్ చేసినట్లు అధికారుల విచారణలో తేలింది. అక్కడున్న దాదాపు 10 మంది వరకు బియ్యం తూకం చేయగా అందరి బియ్యం తూకంలో తేడాలున్నాయి. కోటా విషయంలోనూ ఒక్కో సభ్యుడికి తక్కువ బియ్యం ఇస్తున్నట్లు తేలింది. మొత్తంగా ఒక కార్డుపై దాదాపు 9 కిలోల బియ్యం కాజేశారు. దీంతో వినియోగదారులంతా డీలర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందించిన అధికారులు 6ఏ కింద కేసు నమోదు చేసి, చర్యలు తీసుకుంటామని వినియోగదారులకు నచ్చజెప్పారు. ఇలా నగరంలోని అన్ని రేషన్ దుకాణాలను తనిఖీ చేయాల్సిన అవసరం ఉంది.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

- ట్రాక్టర్ ఢీకొని ఒకరు.. బొలెరో వాహనం టైర్ పేలి మరొకరు..
- నారాయణపేట జిల్లా మరికల్‌లో ఘటనలు
- కేసులు నమోదు

మరికల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ట్రాక్టర్ ఢీకొని ఒకరు, బొలెరో వాహనం టైర్ పేలి కిందపడి మరొకరు చనిపోయారు. వివరాల్లోకి వెళితే.. నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రానికి చెందిన జోగు బాలయ్య(49) జీపు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మరికల్ నుంచి మహబూబ్‌నగర్‌కు వాహనాన్ని నడిపించేవాడు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలోని ఆత్మకూర్ రోడ్డులో ఉన్న రైల్వే బ్రిడ్జి వద్ద ట్రాక్టర్ ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈయనకు ఒక కొడుకు, కూతురు ఉన్నారు. అన్న జోగు రామస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాములు తెలిపారు.

బొలెరో వాహనం కిందపడి..

పచ్చి మిరపకాయల లోడుతో కర్ణాటక నుంచి హైదరాబాద్ వెళ్తున్న బొలెరో వాహనం టైరు పేలడంతో కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా కురుగోడు మండలం సిందిగేరి గ్రామానికి చెందిన డ్రైవర్ మహేశ్(30) వాహనం కింద పడి అక్కడికక్కడే చనిపోయాడు. మండల కేంద్రంలోని ఎల్లిగండ్ల గ్రామ సమీపంలో శనివారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. మహేశ్ అన్న నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఆకాశంలో అద్భుతం

చంద్ర గ్రహణాన్ని ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలు ఆదివారం రాత్రి ఆసక్తిగా తిలకించారు. ఆకాశంలో అద్భుతాన్ని మొబైల్ ఫోన్లలో ఫొటోలు, వీడియోలు తీశారు. సోషల్ మీడియాలో పంచుకున్నారు. గ్రహణం ఫొటోలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.
- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటో గ్రాఫర్, మహబూబ్‌నగర్


9:52


10:13


10:19


10:40



కురుమూర్తి స్వామి ఆలయాన్ని మూసివేస్తున్న అర్చకులు



మన్యంకొండ ఆలయాన్ని మూసి వేస్తున్న ధర్మకర్త అలహరి మధుసూదన్ కుమార్, అర్చకులు

చంద్రగ్రహణం నేపథ్యంలో.. ఆలయాల మూసివేత

- సోమవారం ఉదయం కురుమూర్తి, సాయంత్రం మన్యంకొండ ఆలయాల్లో పూజలు ప్రారంభం

పాలమూరు యూనివర్సిటీ/చిన్నచింతకుంట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చంద్ర గ్రహణం నేపథ్యంలో జిల్లాలోని చిన్నచింతకుంట మండలం అమ్మాపురం సమీపంలో గల కురుమూర్తి స్వామి, మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఆదివారం మూసివేశారు. కురుమూర్తి ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈవో మదనేశ్వర్‌రెడ్డి ఆదేశానుసారం స్వామి వారి గర్భగుడి తలుపులను ఆలయ ప్రధాన అర్చకులు వెంకటయ్య, పాలక మండలి సభ్యులు మూసివేశారు. సోమవారం సంప్రోక్షణ తరువాత ఉదయం 7 గంటలకు ఆలయాన్ని తెరవనున్నట్లు పేర్కొన్నారు. భక్తుల దర్శనాలు యథావిధిగా కొనసాగుతాయని వారు తెలిపారు. మన్యంకొండ ఆలయాన్ని సోమవారం సాయంత్రం శుద్ధి చేసి, తెరువనున్నట్లు దేవస్థాన కార్య నిర్వాహక కార్యదర్శి శ్రీనివాస్‌రాజు తెలిపారు.

మన్యంకొండలో కల్యాణం

పౌర్ణమిని పురస్కరించుకొని మన్యంకొండలో లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త అలహరి మధుసూదన్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, తిలకించారు.

భక్తి శ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ



క్లాక్ టవర్ చౌరస్తా వద్ద ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మిలాద్ ఉన్ నబీ వేడుకలను జిల్లా వ్యాప్తంగా ముస్లింలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మసీదు, మదరసాల నుంచి పెద్ద ఎత్తున శాంతి ర్యాలీలు చేపట్టారు. జిల్లా కేంద్రంలో అసర్ నమాజ్ అనంతరం సాయంత్రం 5 గంటలకు మిలాద్ జూలుస్ మక్కా మసీదు నుంచి ర్యాలీ చేపట్టారు. క్లాక్ టవర్ వద్ద ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్ స్వాగతం పలికారు. మతపెద్దలను ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులను సన్మానించగా, కమిటీ సభ్యులు ఎమ్మెల్యే, చైర్మన్లను సన్మానించారు. ర్యాలీ కార్పొరేషన్ కార్యాలయం, అశోక్‌టాకీస్‌ల మీదుగా అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకోగా అక్కడ ఖౌమి ఏక్తా కమిటీ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన షర్బత్‌ను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్ పంపిణీ చేశారు. ర్యాలీలకు ముందు మసీదుల్లో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్దలు సందేశాన్ని వివరించారు. మహ్మద్ ప్రవక్త ప్రవచానాలు అచరించడం ద్వారా లోక కల్యాణానికి పాటు పడాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని పలు చౌరస్తాలో అన్నదానం, యువకులు రక్తదానం చేశారు. ర్యాలీ అనంతరం షాషాబ్‌గుట్ట దర్గా ఆవరణలో నిర్వహించిన సభలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ధార్మిక వేత్త మౌలానా హైసన్‌బిన్ మహ్మద్ అల్ హముమీ అల్‌ఖాద్రీ సందేశం ఇచ్చారు.



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం, ముస్లిం మత పెద్దలు

పండుగలు మతసామరస్యానికి ప్రతీక: యెన్నం

పండుగలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కుల మతలకు అతీతంగా మహబూబ్‌నగర్ ప్రజలు కలిసి ఉంటారని, అభివృద్ధిలో అందరు భాగస్వాములు కావాలని కోరారు. ప్రవక్త చూపిన మార్గం అనుసరించాలని, ఆయన జీవితం ప్రపంచమానవళికి ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్, టీపీసీసీ అహ్లెసున్నతుల్ జమాత్ మిలాద్ కమిటీ ప్యాట్రన్ సయ్యద్ రజాక్ షా ఖాద్రీ, అధ్యక్షుడు మజహర్‌షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులు లేని కళాశాల

- నారాయణపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీలో 97 పోస్టులకు 57 ఖాళీ
- హెచ్ఆర్ఏ తక్కువగా ఉండటంతో ఇక్కడికి వచ్చేందుకు ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు విముఖత
- ఖాళీల భర్తీకి నోటిఫికేషన్.. 15న ఇంటర్వ్యూలు



నారాయణపేట మెడికల్ కళాశాల

నారాయణపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉంది. దాంతో ఉన్న సిబ్బందితోనే ఒక పక్క విద్యార్థులకు బోధిస్తూ, మరో పక్క జిల్లా జనరల్ ఆస్పత్రిలో రోగులకు సేవలు అందిస్తున్నారు. ఆస్పత్రిలో రోజుకు ఓపీ కోసం 800 నుంచి 1,000 మంది వరకు వస్తున్నారు. హైదరాబాద్‌కు నారాయణపేట 171 కిలో మీటర్ల దూరంలో ఉండటంతో పాటు ఇక్కడ హెచ్ఆర్ఏ తక్కువగా ఉండటంతో ఇక్కడికి వచ్చేందుకు ప్రొఫెసర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ ఆసక్తి చూపడం లేదు. దాంతో కొరత తీరడం లేదు. పోస్టుల భర్తీ కోసం తాజాగా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా సెలక్షన్ కమిటీ దరఖాస్తులను ఆహ్వానించింది. ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరంలో 50 మంది, రెండేళ్ల డిప్లొమా కోర్సులు డయాలసిస్, ఈసీజీ విభాగాల్లో 60 మంది శిక్షణ పొందుతున్నారు.

ఖాళీలు ఇలా..

మెడికల్ కాలేజీలో 97 పోస్టులకు గాను 57 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్న 40 మందితోనే నెట్టుకొస్తున్నారు. మైక్రోబయాలజీ విభాగంలో ఒక ప్రొఫెసర్, ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్, ఇద్దరు ట్యూటర్స్, ఒక సీనియర్ రెసిడెంట్ పోస్టులు ఖాళీ ఉన్నాయి. ఫొరెనిక్ మెడిసిన్ విభాగంలో ఒక ప్రొఫెసర్, ఒక అసోసియేట్ ప్రొఫెసర్, ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్, ఒక ట్యూటర్, ఒక సీనియర్ రెసిడెంట్‌గా పోస్టు ఖాళీగా ఉంది. ఇలా అన్ని విభాగలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల కొరత అధికంగా ఉంది. తరువాత 2 ప్రొఫెసర్లు, 17 అసోసియేట్ ప్రొఫెసర్స్, 19 అసిస్టెంట్ ప్రొఫెసర్స్, 14 సీనియర్ రెసిడెంట్లు, 3 ట్యూటర్, 4 సివిల్ అసిస్టెంట్ స్పెషలిస్టు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటికి అర్హులైన వైద్యులు దరఖాస్తు చేసుకోవాలని మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ ఈ నెల 3న ప్రకటన విడుదల చేశారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆధ్వర్యంలో ఈ నెల 15న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అప్పక్‌పల్లి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో హాజరు కావాలని పేర్కొన్నారు. స్థానికులకే ప్రాధాన్యం ఇస్తారని తెలపారు.

మైసమ్మ దేవతను దర్శనం చేసుకున్న భక్తులు



నాయినోనిపల్లి మైసమ్మ దేవతకు పూజలు చేస్తున్న భక్తులు

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నాయినోనిపల్లి గ్రామ శివారులో భక్తులకు కొంగుబంగారంగా వెలిసిన మైసమ్మ తల్లిని భక్తులు దర్శించుకున్నారు. ఈ ఆదివారం మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి జిల్లాల నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు మైసమ్మ దేవతను దర్శనం చేసుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ ఆదివారం టికెట్ల ద్వారా రూ.42,760, హుండీ ద్వారా రూ.40,716, మొత్తం రూ.83,476ల ఆదాయం వచ్చినట్లు ఈవో రామేశ్వర్‌శర్మ, ఆలయ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఈ ఆదివారం చంద్రగ్రహణం ఉండడంతో భక్తులు తక్కువ సంఖ్య కొంత మేర తగ్గింది.

ఎర్రజెండా వారసత్వాన్ని ప్రజలకు అందించాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

వనపర్తి టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఎర్రజెండా ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమాలు, పోరాటాల వారసత్వాన్ని ప్రజలకు అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. తెలంగాణలో జరిగిన సాయుధ పోరాటానికి బీజేపీకి ఎలాంటి సంబంధం లేదని, తెలంగాణ సాయుధ పోరాటంపై దుష్ప్రచారం చేస్తూ ఆ పోరాటానికి వక్ర భాష్యం పలుకుతూ హిందు, ముస్లింల మధ్య చిచ్చు పెట్టి బీజేపీ లబ్ధి పొందాలని చూస్తుందన్నారు. సాయుధ పోరాటానికి చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, మల్లు స్వరాజ్యం, నరసింహారెడ్డి వంటి వారు ఎందరో నాయకత్వం వహించారని అన్నారు. వారి త్యాగాల ఫలితాన్ని కమ్యూనిస్టులు వారసత్వంగా కొనసాగిస్తున్నారని, దీనిని జీర్ణించుకోలేని బీజేపీ సాయుధ పోరాటం తమ ఆధ్వర్యంలోనే జరిగిందని ప్రజలకు తప్పుడు సంకేతాలు ఇస్తోందన్నారు. కమ్యూనిస్టు పార్టీలు, నాయకులు సీపీఎం ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట తీరును ప్రజలకు వివరించాలన్నారు. సభలు, సమావేశాలు పెట్టి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ జబ్బార్, మండ్ల రాజు, మేకల ఆంజనేయులు, బొబ్బిలి నిక్సన్, సాయిలీల, ఆది, ఆర్‌ఎన్ రమేష్ పాల్గొన్నారు.

తెగించిన మట్టి మాఫియా


విద్యుత్‌తో చెలగాటం



పోతులమడుగు గ్రామంలో 11కేవీ విద్యుత్ వైర్లను కర్రతో పైకి ఎత్తి మట్టిని అన్‌లోడ్ చేస్తున్న దృశ్యం

భూత్పూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా మట్టిని తరలించడం ఒక నేరమైతే.. విద్యుత్ వైర్లను కర్రలతో పైకి ఎత్తిపట్టి లారీలో తీసుకొచ్చిన మట్టిని అన్‌లోడ్ చేస్తున్నారు. ఇలా చేయడం తప్పని, మట్టి తీసుకొచ్చిన లారీ యజమానిని కాలనీవాసులు నిలదీయగా, మీకు ఎందుకంటూ వారితో గొడవకు దిగిన సంఘటన ఆదివారం మండలంలోని పోతులమడుగు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. భూత్పూర్ మునిసిపాలిటీ కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి నిత్యం మునిసిపాలిటీ శివారులో ఉన్న మూర్తయ్య గుట్ట నుంచి అనుమతి లేకుండా మట్టిని తరలిస్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం పోతులమడుగు గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఓ వ్యక్తి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి మట్టి పోయడానికి తీసుకొచ్చారు. అయితే ఆ ఇంటి దగ్గర రోడ్డుపై 11 కేవీ విద్యుత్ వైర్లు, మరో పక్క 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. మట్టిని అన్‌లోడ్ చేయడానికి పొడవాటి కర్రను సపోర్టు పెట్టి 11 కేవీ విద్యుత్ వైర్లను పైకి లేపి మట్టిని అన్‌లోడ్ చేశాడు. ప్రమాదవశాత్తు కర్ర విరిగినా, పక్కకు జరిగినా పెద్ద ప్రమాదం జరిగేది. గమనించిన కాలనీవాసులు గ్రామ పంచాయతీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అక్కడికి వచ్చిన సిబ్బంది పై లారీ యాజమాని, డ్రైవర్ మండిపడ్డారు. ఇలాంటివి మాకు కొత్తేమీ కాదని మట్టి మాఫియా నిర్లక్ష్యంగా చెప్పి వెళ్లి పోవడం గమనార్హం.

ఘనంగా మట్టి వినాయకుడి నిమజ్జనం



పూజల్లో పాల్గొన్న భక్తులు

వెల్దండ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో శ్రీ సాయినగర్ కాలనీలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక విగ్రహాన్ని నిమజ్జన కార్యక్రమం శనివారం రాత్రి అట్టహాసంగా నిర్వహించారు. పదకొండు రోజులు నిత్యపూజలు అందుకున్న గణపతికి మండపం సమీపంలో ప్రత్యేక వేదిక ఏర్పాటుచేసి అలంకరించారు. అనంతరం కాలనీ మహిళలు మంగళహారతులతో వచ్చి పూజలు చేశారు. అనంతరం పంచామృతంతో అభిషేకం చేసి నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేలంపాటలో పెద్దలడ్డూను యెన్నం శ్రీకరరెడ్డి రూ.57,116లకు, గోపిరెడ్డి వెంకటరెడ్డి రూ.32,116 లకు దక్కించుకున్నారు. మట్టి గణపతిని పూజించడంతో పెద్ద ఎత్తున భక్తులు హాజరై నిర్వాహకులను ప్రశంసించారు.

అలుగు పారితే బాట బంద్

● నిలుస్తున్న రాకపోకలు



కర్ని రోడ్డుపై అలుగు పారుతుందని అడ్డుగా ఉంచిన ట్రాక్టర్ (ఫైల్)

మక్తల్ రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలంలోని పలు గ్రామాల్లో వర్షాకాలంలో చెరువులు పూర్తిగా నిండినప్పుడు అలుగులు పారడంతో ప్రధాన రహదారులపై వరద నీరు చేరుతుంది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు తాత్కాలికంగా నిలిచిపోతున్నాయి. గోలపల్లి, మంథన్‌గోడ్, రుద్ర సముద్రం, ముస్లాయపల్లి, చిట్యాల తదితర గ్రామాల్లో అలుగు సమస్యలు ప్రధానంగా ఉంటున్నాయి. అలుగు పారినప్పుడు రహదారిపై నీరు పారకుండా శాశ్వత ప్రాతిపదికన కల్వర్టులు నిర్మించి వరదలు సమయంలో సైతం రాకపోకలు సజావుగా సాగించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

త్వరలో శాశ్వత పరిష్కారానికి చర్యలు



మండలంలోని పలు గ్రామాల అలుగు సమస్యలు మంత్రి వాటికి శ్రీహరి దృష్టికి తీసుకెళ్లాం. మంత్రి వెంటనే స్పందించి శాశ్వత ప్రతిపాదనలకు నివేదికలు సిద్ధం చేయమని అధికారులను ఆదేశించారు. అతి త్వరలో శాశ్వత పరిష్కారానికి సంబంధించి పనులను ప్రారంభిస్తాం.

- బి.గణేష్‌కుమార్, మక్తల్ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్

అలుగు పారినప్పుడల్లా తీవ్ర ఇబ్బందులు



కర్ని గ్రామ చెరువు అలుగు పారినప్పుడల్లా రహదారిపై పెద్ద ఎత్తున నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకల నుంచి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అత్యవసర సమయాల్లో అతి కష్టం మీద దాటాల్సి వస్తుంది. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని కోరుతున్నాం.

- వాకిటి ఆంజనేయులు, కర్ని గ్రామం

అధికారులు, ప్రజాప్రతినిధులకు మా గోడు పట్టదా

» భూ నిర్వాసితుల ఆవేదన



నిరాహార దీక్ష చేస్తున్న భూ నిర్వాసితులు

కోడేరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా తీగలపల్లి రెవెన్యూ శివారులో భూములు కోల్పోయిన నిర్వాసితుల గోడు అధికారులకు, ప్రజాప్రతినిధులకు పట్టదా అంటూ నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం భూ నిర్వాసితుల రిలే నిరాహార దీక్షలు ఏడవ రోజుకు చేరుకున్నాయి. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.నరసింహ మాట్లాడుతూ భూమిని నమ్ముకొని జీవనోపాధి పొందుతున్న రైతుల భూమిని ప్రాజెక్టుకు పదేళ్లుగా స్వాధీనం చేసుకొని భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించకుండా రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటు భూమి లేక అటు జీవనోపాధి లేక రైతులు గగ్గోలు పెడుతూ అధికారుల, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతూ కుటుంబాలను రోడ్డుపై వేసుకున్నారని పేర్కొన్నారు. అయినా అధికారులకు, ప్రజాప్రతినిధులకు చీమ కుట్టినట్టు కూడా లేదని మండిపడ్డారు.

వెంటనే భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకుంటే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భూ నిర్వాసితులు చంద్రశేఖర్, పబ్బతి స్వామి, రాములు, లక్ష్మయ్య బొజ్జమ్మ, ఫాతిమా, చిన్న రాములు పాల్గొన్నారు.

ఎకరాకు రూ. 35 లక్షలు, ఇంటికో ఉద్యోగం ఇవ్వాలి



కానుకుర్తి గ్రామంలో దీక్ష చేస్తున్న రైతులు



జిల్లా కేంద్రంలోని మునిసిపల్ పార్క్ ముందర భూ నిర్వాసితుల రిలే దీక్షలు

దామరగిద్ద/నారాయణపేట టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట-కొడంగల్ ఎత్తి పోతల పథకంలో భాగంగా కానుకుర్తి రిజర్వాయర్‌లో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులకు ఎకరాకు రూ. 35 లక్షల పరిహారం అందించి ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని భూ నిర్వాసిత రైతులు కోరారు. ఆదివారం భూ నిర్వాసితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 32వ రోజుకు చేరాయి.

ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నారు. మేము ప్రాజెక్టుకు వ్యతిరేకం కాదు.. కానీ మాకు సరైన నష్టపరిహారంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం సాధించే వరకు మా న్యాయమైన పోరాటం ఆపే ప్రసక్తే లేదని అన్నారు. ప్రభుత్వం బలవంతంగా బెదిరించి మా భూములను లాక్కుంటే మాకు సరైన నష్టపరిహారం ఇవ్వకుంటే అవసరమైతే మేము చావడానికైనా వెనుకాడబోమని అన్నారు. సరైన న్యాయం చేయకుంటే రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని ఉధృతం చేసి మా హక్కులను సాధించుకుంటామని అన్నారు.

55వ రోజుకు..

మక్తల్ - నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితుల రిలే దీక్షలు ఆదివారం నాటికి 55వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా భూ నిర్వాసితుల సలహాదారులు బల్‌రాం, కృష్ణ మడివాల్, పవన్‌కుమార్‌లు మాట్లాడుతూ భూ నిర్వాసితులకు న్యాయమైన నష్టపరిహారంగా ఎకరాకు రూ.30 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వలసలకు, కరువులకు నెలవుగా మారిన నారాయణపేట ప్రాంతానికి తప్పని సరిగా ప్రాజెక్టు అవసరమని, ప్రాజెక్టు నిర్మాణానికి ఎలాంటి అభ్యంతరం చెప్పడం లేదన్నారు.

బలవంతపు భూ సేకరణ చేయరాదని, భూ నిర్వాసితుల కుటుంబాలలో ఒకరికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలన్నారు. ఈ దీక్షలో పేరపళ్ల గ్రామ భూ నిర్వాసితులు మద్దెల్‌బీడ్ అంజి, కొనంగేరి నర్సిములు, కాశప్ప, గొల్ల శివ, గోవర్ధన్, సుదర్శన్, మిద్దెమీది భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తికి గాయాలు

కొల్లాపూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కుడికిళ్ల గ్రామ సమీపంలో రెండు మోటార్ బైక్‌లు ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి.. కొల్లాపూర్ మండల పరిధిలోని మొలచింతలపల్లి గ్రామ మాజీ సర్పంచ్ హైమావతి భర్త బాలస్వామి గౌడ్ ఆదివారం సాయంత్రం కల్వకోల్ నుంచి కుడికిళ్ల మీదుగా తమ సొంత గ్రామమైన మొలచింతలపల్లి గ్రామానికి వెళ్తున్నారు. కుడికిళ్ల గ్రామానికి చెందిన చంద్రుడు నార్లాపూర్ నుంచి తన స్వగ్రామానికి వస్తుండగా ఎదురెదురుగా వీరి బైక్‌లు ఢీకొనడంతో బాలస్వామి తలకు తీవ్ర గాయమైంది. అంబులెన్స్‌లో కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. చంద్రుడుకు ఎలాంటి గాయాలు కాలేదని కుడికిళ్ల గ్రామస్థులు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి విద్యార్థి గల్లంతు

» ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న మరో విద్యార్థి
» కృష్ణానది ఒడ్డున పుట్టీలో నిద్ర పోయిన పిల్లలు
» వరద ఎక్కువవడంతో పుట్టీ కొట్టుకుపోయి బోల్తా
» లోయర్ జూరాల జల విద్యుత్ కేంద్రం వద్ద ఘటన



నది వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న రూరల్ ఎస్‌ఐ

గద్వాల, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) : నదిలో చేపల వేటకు వెళ్లిన ఓ విద్యార్థి గల్లంతయ్యాడు. మరో విద్యార్థి ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండల పరిధిలోని రేకులపల్లి సమీపంలో ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన చంద్రశేఖర్ (13), మరో విద్యార్థి కృష్ణతో కలిసి శనివారం రాత్రి లోయర్ జూరాల జల విద్యుత్ కేంద్రం వద్ద నదిలో చేపల వేటకు వెళ్లారు. పుట్టీలో నదిలోకి వెళ్లి వల వేశారు. తర్వాత ఒడ్డుకు చేరుకొని, అదే పుట్టీలో పడుకున్నారు. కానీ పుట్టీని తాడుతో కట్టేయడం మరిచిపోయారు. రాత్రి 10 గంటల సమయంలో జూరాల ప్రాజెక్టుకు కొద్దిగా ఇన్‌ఫ్లో పెరిగింది. అప్పటికే ప్రాజెక్టు 8 గేట్ల నుంచి నీటి విడుదల కొనసాగుతుండగా, అదనంగా మరో 3 గేట్లు తెరిచారు. దీంతో వరద పెరిగి, అలల తాకిడికి పుట్టి నీటిలో ముందుకొచ్చి, సిల్ప్‌వే నుంచి దొర్లిపడింది. అదే సమయంలో నిద్ర నుంచి మేల్కొన్న కృష్ణ ప్రమాదాన్ని పసిగట్టి, ఈత కొట్టుకుంటూ ఒడ్డుకు చేరుకున్నాడు. దుప్పటి కప్పుకొని నిద్రపోతున్న చంద్రశేఖర్ వరదలో కొట్టుకుపోయాడు. అతడికి ఈత కూడా రాదని బంధువులు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే బంధువులు, గ్రామస్థులు నది వద్దకు చేరుకున్నా, వరద ఎక్కువగా ఉండటంతో ఏమీ చేయలేని పరిస్థితి నెలకొన్నది. సమాచారం అందుకున్న రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్ శుక్రవారం తెల్లవారుజామున ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందంతో కలిసి నది వద్దకు వెళ్లారు. నదిలో 1.20 లక్షల క్యూసెక్కువ వరద ఉండటంతో కొంత మేర ప్రయత్నం చేసి, వెనుదిరిగి వచ్చారు. గల్లంతు అయిన విద్యార్థి గతంలో ఎప్పుడూ చేపల వేటకు వెళ్లలేదని, ఇప్పుడు ఎందుకు వెళ్లాడో తెలియదని బంధువులు చెప్తున్నారు. అతడి తండ్రి నర్సింహులు 8 సంవత్సరాల క్రితం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. తల్లి పద్మమ్మ ముగ్గురు పిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నది. గల్లంతయిన చంద్రశేఖర్ చిన్న కుమారుడు కాగా, అతడు గురుకుల పాఠశాలలో చదువుతున్నాడు. సెలవులు ఉండటంతో ఇంటికి వచ్చి, చేపల వేటకు వెళ్లి నదిలో కొట్టుకుపోయాడు. సంఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రక్కేస్తున్నాయి..

● మద్దూర్‌లో కోతుల బీభత్సం

» వరుస దాడులతో బెంబేలెత్తిపోతున్న పట్టణ వాసులు
» ఎనిమిదికి చేరిన బాధితుల సంఖ్య
» పట్టించుకోని ఫారెస్టు అధికారులు



కోతుల దాడిలో గాయపడ్డ దివ్యాంగురాలిని పరామర్శిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మద్దూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మద్దూర్‌లో ఏ నోట విన్నా కోతుల మాటనే. అవి మనుషులపై చేసే వరుస దాడులతో మద్దూర్ పట్టణ వాసులు బెంబేలెత్తిపోతున్నారు. బయటకు వెళ్లాలన్నా జంకే పరిస్థితి నెలకొంది, ఏవైపు నుంచి వచ్చి దాడి చేస్తాయోనని భయపడుతూ ముందుకు సాగాల్సి వస్తోంది. గత ఐదు రోజుల్లో ఎనిమిది మందిని దాడి చేసి గాయపర్చిన సంఘటనలు చోటు చేసుకున్నాయి.

రోజూ ఏదో వీధిలో కోతి దాడి చేసిందని మాటే వినిపిస్తోంది. గాయపడిన వారిలో యువకులు, పిల్లలు, వృద్ధులు ఉన్నారు. ఇంత జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదంటే ఇక ముందు ఏ పరిస్థితి నెలకొంటుందోనని పట్టణ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ వీధుల్లో స్వేరవిహారం చేస్తున్న కోతుల నుంచి రక్షణ కల్పించాలని కొన్ని రోజుల నుంచి వేడుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోతుల వరుస దాడుల్లో పట్టణానికి చెందని కటికె అబ్దుల్లా, దస్తప్ప, సాకలి వెంకటమ్మ, దాసరి లలిత, గొల్ల లక్ష్మి, గొల్ల సాయమ్మ తదితరులు గాయపడ్డారు. ఈ విషయమై ఫారెస్టు అధికారులకు సమాచారమందించినా ఫలితం లేకుండాపోయిందని వారు ఆరోపిస్తున్నారు. కోతుల దాడుల్లో గాయపడ్డ బాధితులను ప్రజా సంఘాల నాయకులు అలీ, అశోక్ పరామర్శించారు. కోతులను పట్టణం నుంచి అడవిలోకి తరలించేందుకు ఫారెస్టు అధికారులు చర్యలు తీసుకొని వాటి దాడుల నుంచి పట్టణ వాసులు రక్షణ కల్పించాలని కోరుతన్నారు.

పాలకుల నిర్వాకంతో హక్కులకు ముప్పు



మాట్లాడుతున్న టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్

పాలమూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు ముప్పు వాటిల్లుతోందని టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సి.వెంకటేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీయూసీఐ కార్యాలయంలో జిల్లా రైస్, ఆయిల్‌మిల్ వర్కర్స్ యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 78 ఏళ్లు అవుతున్నా ప్రాథమిక హక్కులకే భంగం వాటిల్లే పరిస్థితి ఏర్పడటం అమానుషమన్నారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కేంద్రం నాలుగు లేబర్ కోడ్లను అమల్లోకి తీసుకువస్తోందన్నారు. 12 గంటల పని విధానం చట్టబద్ధం చేయటం, సామాజిక భద్రతా పథకాలకు నిధులు తగ్గిస్తోందన్నారు. కార్మిక సంఘాల రిజిస్ట్రేషన్‌ను కఠినతరం చేసి, కార్మిక సంఘాలను రద్దు చేసే కుట్ర జరుగుతోందన్నారు. చట్టాలు అమలు చేయని యాజమాన్యాలకు శిక్షలు తగ్గించటం, కార్మిక శాఖను పూర్తిగా ఫెసిలిటేట్ విభాగంగా మార్చడం, స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించకుండా వెట్టి చాకిరి చేసే విధంగా లేబర్ కోడ్లు రూపొందించటం సరికాదన్నారు. తక్షణమే నాలుగు లేబర్‌కోడ్లను రద్దుచేసి, కార్మిక చట్టాలను కాపాడుకోవాలని కార్మికులకు పిలుపునిచ్చారు. రైస్‌మిల్ సంఘం అధ్యక్షుడు దాసు, ఉపాధ్యక్షుడు చెన్నయ్య, శేఖర్, ఆంజనేయులు, కృష్ణయ్య, శ్రీనివాసులు, నారాయణ, బుజ్జి పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను సమూలంగా పారద్రోలాలి

» జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చెలిమెల రాజేశ్వర్



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చెలిమెల రాజేశ్వర్

వనపర్తి టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజలను చైతన్యవంతులను చేస్తూ మూఢనమ్మకాల వైపు వెళ్లకుండా మూఢనమ్మకాలను సమూలంగా పారద్రోలాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చెలిమెల రాజేశ్వర్ అన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వైజ్ఞానిక ఉమ్మడి జిల్లా శిక్షణా తరగతులు జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేటు కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాస్త్ర సాకేంతిక రంగాల్లో ఒకవైపు అభివృద్ధి జరుగుతుంటే సామాన్య జనాలు వాటిని ఉపయోగించుకోకుండా మూఢనమ్మకాల వైపు వెళ్లడం ఆందోళన కలిగిస్తుందన్నారు. మూఢనమ్మకాల వైపు వెళ్తున్న ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత జన విజ్ఞాన వేదిక వంటి సైన్స్ ఆర్గనైజేషన్ సభ్యులకు, మేధావులకు, విద్యావంతులపై ఉందన్నారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జితేందర్, ప్రధాన కార్యదర్శి రాజా, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటరమణ, జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



రేణుక (ఫైల్‌ఫొటో)

భూత్పూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం కప్పెట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్రశేఖర్ కథనం ప్రకారం.. కప్పెట గ్రామానికి చెందిన వెంకట్‌స్వామి, రేణుక భార్యాభర్తలు. వీరికి ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కూతురు పల్లవిని రెండేళ్ల క్రితం వనపర్తి జిల్లా కమాలోద్దీన్‌పూర్ గ్రామానికి చెందిన నర్సిములుకు ఇచ్చి వివాహం చేశారు. కాగా వెంకట్‌స్వామి మద్యం తాగి తరుచూ భార్యతో గొడవ పడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో వెంకట్‌స్వామి ఈనెల 6వ తేదీన మద్యంత తాగి ఎప్పటిలాగే భార్యతో గొడవ పడ్డాడు. ఇంతలో ఏం జరిగిందో తెలియదు రాత్రి పడుకున్న చోట రేణుక అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది ఉంది. మృతురాలి కూతురు పల్లవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్రైం కార్నర్

చేపల వేటకు వెళ్లి వృద్ధుడి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకెళ్లిన వృద్ధుడు పెబ్బేటి సత్యం (62) ప్రమాదవశాత్తు చెరువులో పడి చనిపోయినట్లు ఎస్ఐ గోవర్ధన్ ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ మండలం అవురాసిపల్లి గ్రామానికి చెందిన పెబ్బేటి సత్యం ఆదివారం ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి చేపలు పట్టడానికి ఉయ్యాలవాడ శివారులోని కేసరి సముద్రం వద్దకు వెళ్లాడు. చెరువులో వల వేస్తుండగా ప్రమాదవశాత్తు వల కాళ్లకు చుట్టుకుని నీళ్లలో పడిపోయాడు. చుట్టుపక్కల వారు గుర్తించి బయటకు తీసే లోపే అతను మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సంఘటనపై మృతుని కుమారుడు పెబ్బేటి శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి


సహస్య (ఫైల్)

మల్దకల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అడవిరావులచెరువు గ్రామానికి నరసింహులు, అరుణ దంపతుల కూతురు సహస్య(4) గతనెల 31న అడవి రావులచెరువు గ్రామంలో వినాయకుని మండపం దగ్గర భోజనాల సమయంలో వేడినీటిలో పడి తీవ్రంగా గాయపడింది. దీంతో కుటుంబ సభ్యులు చిన్నారిని గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందింది. తల్లి అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నందీకర్ తెలిపారు.

వ్యక్తిపై దాడి: కేసు నమోదు

అలంపూరు చౌరస్తా, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి మండల తక్కశిల గ్రామంలో వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శేఖర్ తెలిపారు. గ్రామానికి చెందిన నాగశేషులు కూలీలకు డబ్బులు పంచుతుండగా కుమార్ అనే వ్యక్తి పాతగొడవలు మనసులో పెట్టుకుని దాడి చేశాడు. అక్కడే ఉన్న కుమార్ మేనమామ రెడ్డిపోగుహుస్సేన్ కుడా దాడి చేయడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బొలెరోను ఢీ కొన్న లారీ

» ముగ్గురికి గాయాలు

మూసాపేట, సెప్టెంబ రు 7 (ఆంధ్రజ్యోతి) : ముందుగా వెళ్తున్న బొలెరో వాహనాన్ని లారీ ఢీ కొట్టడంతో ముగ్గురు గాయ పడిన సంఘటన ఆదివారం అడ్డాకుల మండలం కాటవరం వద్ద చోటుచేసు కుంది. ఎస్ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. మహ బూబ్‌నగర్ నుంచి బీచుపల్లికి వెళ్తున్న బొలెరో వా హనాన్ని షాద్‌నగర్ నుంచి బెంగుళూరు వెళ్తున్న లారీ అతివేగంగా వెనకి నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో లింగం, కిరణ్‌కుమార్, రాధేశ్యామ్‌కు గాయాలు కాగా, చికిత్సకై నిమిత్తం జిల్లా అసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కలుషిత నీరు తాగి 25 గొర్రెలు మృతి


మృతి చెందిన గొర్రెలను పరిశీలిసున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తకోట, సెప్టెంబర్ 7 (ఆంధ్రజ్యోతి) : కలుషిత నీరు తాగి 25 గొర్రెలు మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన దావాజిపల్లి చంద్రయ్య జీవనాధారం కోసం గొర్రెల మందను పెంచుకుంటున్నాడు. గొర్రెలను మేతల కోసం బైపాస్ రోడ్డు సమీపంలోకి తీసుకెళ్లాడు. మేతల అనంతర పొలాల దగ్గరలో నీటికి తీసుకెళ్లాడు. నీళ్లు తాగిన అర గంటలో ఒకదాని వెంట మరొకటి కిందపడి 25 గొర్రెలు మృతి చెందినట్లు బాధితుడి తెలిపాడు. సమీపంలో అటుగా వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు విషయం తెలుసుకొని పశువైద్యాధికారులకు సమాచారం ఇచ్చారు. వైద్య సిబ్బంది తిరుపతయ్య, ఖాజా మైనోద్దీన్ వచ్చి కలుషిత నీరు (గుళికలు కలిసిన నీరు లేదా వాహనాల బ్యాటరీ నీళ్లు) తాగడంతోనే మృతి చెందాయి చెప్పి మిగతా గొర్రెలకు మందులు ఇచ్చారు. మృతి చెందిన గొర్రెల విలువ రూ.2.50 లక్షలు ఉంటుందని తెలిపారు.

ధాన్యం లారీ పట్టివేత


భూత్పూర్ పోలీస్‌స్టేషన్ దగ్గర వరి ధాన్యం లోడుతో ఉన్న లారీ

భూత్పూర్, సెప్టెం బరు 7 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా ధాన్యం తరలిస్తున్న లారీని విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఈ నెల 3వ తేదీన పట్టుకున్నారు. అయితే మూడు రోజుల్లో ఏం జరిగిందో కానీ, అనుమతి ఉన్నట్లుగా సృష్టించి జిల్లా పౌర సరఫరాల అధికారులను సైతం తికమక చేశారు. ఈ సంఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. కోస్గి మండల కేంద్రం నుంచి ఓ రైస్ మిల్లు ద్వారా ఈనెల 3వ తేదీన 30 టన్నుల ధాన్యం లోడుతో లారీ బయలుదేరింది. ఈ లారీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లా వెలుగోడు ప్రాంతానికి వెళ్తున్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పాలమూరు జిల్లా కేంద్రానికి చెందిన కొందరు వ్యక్తులు లారీని భూత్పూర్ పోలీస్ స్టేషన్‌కు రాగానే పట్టుకొని పోలీసులకు అప్పజెప్పారు. ధాన్యాన్ని పరిశీలించిన పోలీసులు జిల్లా పౌర సరఫరాల అధికారులకు సమాచారం అందించారు. ఈనెల 6వ తేదీన పోలీస్‌స్టేషన్ చేరుకున్న ఏఎస్‌వో, సీవిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ లారీని సీజ్ చేసి, దగ్గరలోని ఓ రైస్ మిల్లులో ధాన్యాన్ని తీసుకొని మళ్లీ లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా ధాన్యం తరలిస్తున్న యజమానులు మూడు రోజుల తరువాత తాము ఈ ధాన్యాన్ని జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ రాధిక అగ్రోటెక్‌కు తరలిస్తున్నట్లుగా కాగితాలు సృష్టించి పోలీసులకు చూపించగా, వారు జిల్లా పౌర సరఫరా అధికారులకు సమాచారం అందించారు. ఈ విషయాన్ని జిల్లా పౌర సరఫరా శాఖ అధికారి శ్రీనివాసులు ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా వరి ధాన్యం తరలిస్తున్న లారీని, ధాన్యాన్ని సీజ్ చేయడం జరిగిందని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టి తీసుకెళ్లి పూర్తి స్థాయి విచారణ చేపడుతామని తెలిపారు.

బిగ్‌బాస్ షోకు ఫోక్ సింగర్ రాము రాథోడ్


రామురాథోడ్

భూత్పూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాను బొంబాయికి... రాను పాట రాసి, పాడి డ్యాన్స్ చేసిన పాలమూరు గిరిన బిడ్డ రామురాథోడ్ బిగ్‌బాస్ షోకు ఎంపికై ఆదివారం టీవీ చానల్‌లో కడనబడ్డాడు. ఈ సందర్భంగా రాము రాథోడ్ సొంత గ్రామమైన భూత్పూర్ మునిసిపాలిటీలోని గోప్లాపూర్ గ్రామంలో ప్రజలు టీవీలో రామురాథోడ్ షో చూడడానికి ఆసక్తి కనబర్చారు. ఓ మామూలు సాదాసీద, నిరుపేద గిరిజన కుటుంబంలో కిషన్‌నాయక్, కమలమ్మ దంపతులకు రామురాథోడ్ జన్మించాడు. చిన్నతనం నుంచి ఇంట్లో ఉండే టేప్ రికార్డులో పాటలు వింటూ.. వచ్చి రాని డ్యాన్సులు చేసేవాడు. రాను బొంబాయికి రాను పాటతో రికార్డు స్థాయిలో యూ ట్యూబ్, సోషల్ మీడియాలో 50 కోట్ల వ్యూస్‌తో రికార్డు బద్దలు కొట్టి నేడు బిగ్‌బాస్ షోకు ఎంపిక కావడంతో పాలమూరు జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతిని తీసుకోరావాలని గోప్లాపూర్ వాసులు కోరుతున్నారు.

అనుమానం, భూ తగాదాలే హత్యకు కారణం

» కన్న తండ్రిని దారుణంగా చంపిన కొడుకు
» 24 గంటల్లో కొడుకు బీరయ్య, సహకరించిన అంజిలు అరెస్టు
» షైన్ బైకు, షిఫ్ట్ డిజైర్ కారు, ఆక్సల్ బ్లేడు, నాలుగు బంగారు చెవి పోగులు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం
» వివరాలు వెల్లడించిన కల్వకుర్తి డీఎస్పీ సైరెడ్డి వెంకట్‌రెడ్డి
» కేసును ఛేదించిన సీఐ, ఎస్ఐ, పోలీస్ సిబ్బందిని అభినందించి రివార్డులు అందించిన ఎస్పీ, డీఎస్పీ


ఎస్ఐ మాధవరెడ్డికి రివార్డు అందజేస్తున్న డీఎస్పీ సైరెడ్డి వెంకట్‌రెడ్డి

కల్వకుర్తి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చేతబడి అనుమానం, భూ తగాదాలు, గొడవల వల్లే తండ్రిని దారుణంగా కొడుకు హత్య చేశాడని కల్వకుర్తి డీఎస్పీ సైరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. తండ్రిని హత్య చేసిన కొడుకును, ఇతనికి సహకరించిన మరో వ్యక్తిని అరెస్టు చేసి, హత్య వెనుక కారణాలను విలేకరుల సమావేశంలో పోలీసులు వెల్లడించారు. కల్వకుర్తి పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కల్వకుర్తి సీఐ బి.నాగార్జున, ఎస్ఐ జి.మాదవరెడ్డిలతో కలిసి డీఎస్పీ సైరెడ్డి వెంకట్‌రెడ్డి హత్య కేసు వివరాలను వెల్లడించారు. కల్వకుర్తి పట్టణంలోని వాసవి నగర్ కాలనీలో ఉండే చాగొండ బాలయ్య(75), చాగొండ బీరయ్యలు తండ్రీకొడుకులు. చాగొండ బాలయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవ నం సాగిస్తున్నాడు. ఈ నెల 3న మధ్యాహ్నం 3గంటల కు బాలయ్య తన వ్యవసాయ పొలానికి వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో అతని పెద్ద కుమారుడు చాగొండ మల్లయ్య పొలం దగ్గరకు వెళ్లి తండ్రికోసం వెతికినా ఆచూకీ కన్పించలేదు. గురువారం ఉదయం వెళ్లి చూడగా, బాలయ్యకు చెందిన ద్విచక్రవాహనం బీరయ్య షెడ్డు వద్ద ఉండడాన్ని బాలయ్య పెద్ద కుమారుడు మల్లయ్య గమనించాడు. అక్కడక్కడా రక్తపు మరకలు కనిపించడంతో అనుమానం వచ్చి ఉదయం 10గంటలకు పోలీస్ స్టేషన్‌లో తన తండ్రి కనిపించడం లేదని ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు షెడ్డును, అక్కడున్న సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీ లించగా తండ్రి బాలయ్యను కొడుకు బీరయ్య కర్రతో కొట్టి చంపినట్లు కనిపించింది. ఆ తర్వాత బీరయ్య వంగూరు మండలం రంగాపూర్‌కు చెందిన తన బంధువు అయిన అంజికి ఫోన్‌చేసి కారు తీసుకు రావాలని చెప్పాడు. కారు డిక్కీలో బాలయ్య మృతదేహాన్ని వేసి కారును అంజికి ఇచ్చి పంపించాడు. కారు వంగూరు మండలం సదగోడు సమీపంలో డీఎల్ఐ కాల్వ వద్ద ఆపి పథకం ప్రకారం గొంతు కోసి తలను డీఎల్ఐ కాల్వలో పడేశారు. మొండేన్ని డిండిచింతపల్లి సమీపంలోని దుందుభీ నదిలో పారవేశారు. సీసీ ఫుటేజీల ఆధారంగా బాలయ్య మృతదేహం కోసం శుక్రవారం డిండి చింతప ల్లి దుందుభీ నది వద్ద గాలింపు చేపట్టగా ఉప్పునుంతల మండలం కొరటికల్ సమీపంలో తల లేని మృతదేహం లభించిందని డీఎస్పీ తెలిపారు. తల లేని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. శనివారం మధ్యాహ్నం కేసు దర్యాప్తులో భాగంగా జేపీనగర్ నుంచి కొట్ర వైపు వెళ్లే రహదారిలో తండ్రిని హత్య చేసిన బీరయ్య, సహకరించిన అంజిలను గుర్తించి స్టేషన్‌కు తీసుకొచ్చినట్లు తెలిపారు. వారిని విచారించగా తండ్రి బాలయ్య తామే హత్య చేశా మని, తలను, మొండేన్ని వేరు చేశామని వారు ఒప్పుకు న్నట్లు డీఎస్పీ తెలిపారు. తలను శనివారం రాత్రి సదగోడు సమీపంలోని డీఎల్ఐ కాల్వలో తలను గుర్తించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులను అప్పజెప్పినట్లు డీఎస్పీ తెలిపారు.

నిందితులు బీరయ్య, అంజిలను అరెస్టు చేసి వారి నుంచి షిఫ్ట డిజైర్ కారు, షైన్‌బైక్, ఆక్సల్ బ్లెడు, నాలుగు చెవి పోగులు (బంగారు), రెండు సెల్‌ఫోన్లను స్వాధీనపర్చుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. 24గంటల్లో కేసును ఛేదించిన సీఐ బి. నాగార్జున, ఎస్ఐ మాధవరెడ్డి, ఉప్పునుంతల ఎస్ఐ వెంకట్‌రెడ్డి, వంగూరు ఎస్ఐ మహేష్‌లతో పాటు పోలీస్ సిబ్బందిని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అభినందిస్తూ రివార్డులు ఇచ్చారన్నారు. ఎస్ఐ మాధవరెడ్డి, పోలీస్ సిబ్బందికి రివార్డులను డీఎస్పీ అందజేశారు. కేసుకు సహకరించిన కొరటికల్ గ్రామస్థులను ఆయన అభినందించారు.

లక్ష్యం చేరిన జల విద్యుత్ ఉత్పత్తి

● ఎగువ, దిగువ ఉత్పత్తి కేంద్రాల్లో 12 యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి



దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం

ఆత్మకూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో నిర్దేశించిన లక్ష్యం చేరిందని ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల లక్ష్యం 610 మిలియన్ యూనిట్లు. ఈ నేపథ్యంలో ఎగువ నుంచి ఆశించిన మేర వరద వస్తున్న కారణంగా ఎగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో గడిచిన 24 గంటల్లో ఆరు యూనిట్ల ద్వారా 4.361 మిలియన్ యూనిట్లను చేపట్టారు.

ప్రారంభించిన నాటి నుంచి ఆదివారం సాయంత్రం నాటికి 292.964 మిలియన్ యూనిట్లను చేరుకుందని తెలిపారు. అలాగే దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ఆరు యూనిట్ల ద్వారా 4.209 మిలియన్ యూనిట్లను చేపట్టగా... ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 320.595 మిలియన్ యూనిట్లను చేరుకుందని తెలిపారు. వరద ఇదే మాదిరిగా కొనసాగితే రికార్డు స్థాయిలో జల విద్యుత్ ఉత్పత్తిని చేపట్టే అవకాశం ఉందని వివరించారు.

అనుమతులు లేవని ఆపారు

» వడ్డె ఓబన్న విగ్రహావిష్కరణ నిలుపుదల
» త్వరలోనే రాష్ట్ర బీసీ నాయకులతో కలిసి ఆవిష్కరిస్తాం
» మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే మర్రి


పాలెంలో వడ్డెర సంఘం నాయకులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి

బిజినేపల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమరయోధుడైన వడ్డె ఓబన్న విగ్రహ ఆవిష్కరణను అనుమతులు లేవని ఆపడం బాధాకరమని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డిలు పేర్కొన్నారు. మండలంలోని బోయాపూర్ గ్రామంలో వడ్డె ఓబన్న విగ్రహాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి ఆవిష్కరించాల్సి ఉండగా అనుమతులు లేవని పంచాయతీ శాఖ అధికారులు ఫిర్యాదు ఇవ్వడంతో పోలీసులు ఆవిష్కరణను అడ్డుకున్నారు.

మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ సైన్యంతో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సైన్యాధ్యక్షుడిగా పోరాడిని వడ్డె ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరించకుండా కొందరు రాజకీయ దురుద్దేశంతో అడ్డుకున్నారని విమర్శించారు. విగ్రహ ఆవిష్కరణకు అనుమతులు తీసుకొని అన్ని కులాల రాష్ట్ర బీసీ నాయకులతో కలిసి వేలాది మంది సమక్షంలో త్వరలోనే వడ్డెరుల ఆరాధ్యదైవం వడ్డె ఓబన్న విగ్రహ ఆవిష్కరణ చేపడుతామని అన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో రోజు రోజుకు గ్రామాల్లో వ్యతిరేకత పెరగడంతో ఆందోళనకు లోనై ప్రతిపక్ష పార్టీల నాయకులు చేసే కార్యక్రమాలను అడ్డుకోవాలనే కక్ష సాధింపు చర్యగా విగ్రహ ఆవిష్కరణను అడ్డుకుంటున్నాని ఆయన ఆరోపించారు. ఒక పక్క ఆర్డినెన్స్ తెచ్చి అయినా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెబుతుంటే, బీసీ బిడ్డ వడ్డె ఓబన్న విగ్రహాన్ని అడ్డుకోవడం కాంగ్రెస్ పార్టీ నాయకుల చిత్తశుద్ధికి అద్దం పడుతుందన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పులేందర్‌రెడ్డి, శేఖర్‌రావు, మహేష్ రావు, తిరుపతయ్య, బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు వెంకటస్వామి, బోయాపూర్ మాజీ సర్పంచ్ రాఘవులు, వడ్డెర సంఘం నాయకులు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

గెలుపోటములు సహజం

» క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలి
» ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్
» ముగిసిన రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ


షటిల్ బ్యాడ్మింటన్ విజేతలతో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో గెలుపోటములు సహజమని మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్-13 బాల బాలికల షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షటిల్‌లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాక్షించారు. జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవలేదని, ఎంతో మంది క్రీడాకారులు ఆయా క్రీడా అంశాల్లో సత్తాచాటుతున్నారని గుర్తుచేశారు. నాయకులు అమరేందర్‌రాజు, సురేందర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ (ఎండీబీఏ) అధ్యక్షుడు ఎస్.శ్యామ్‌సుందర్‌గౌడ్, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఎండీబీఏ సెక్రటరీ ఎల్.రవికుమార్, ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర క్రీడా పరిశీలకుడు సుధాకర్ పాల్గొన్నారు.


బాలికల సింగిల్స్ విజేతగా నిమ్మశాన్వి (సంగారెడ్డి)

విజేతలు వీరే..

రాష్ట్రస్థాయి అండర్-13 బాల, బాలికల షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ ముగిసింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లు హోరాహోరీగా జరిగాయి. బాలుర సింగిల్స్ విభాగంలో శివన్స్ పబ్బు శివన్స్ (మేడ్చల్ మల్కాజ్‌గిరి) విజేతగా నిలవగా, రన్నర్‌గా కుంజల జస్ప్రీత్ (వరంగల్), మూడో స్థానంలో అద్విత్‌సత్తు (వికారాబాద్), నాలుగో స్థానంలో రామ్‌చరణ్ తేజ ఆకుల (మేడ్చల్ మల్కాజ్‌గిరి) నిలిచారు. బాలికల విభాగంలో విజేతగా నిమ్మశాన్వి (సంగారెడ్డి), రన్నర్‌గా అనుముల శ్రీవైభవి (నిజామాబాద్), మూడో స్థానంలో దియ ఆనంద్ (వికారాబాద్), నాలుగో స్థానంలో మనిస్విని భుక్య (వరంగల్) నిలిచారు. బాలుర డబుల్స్ విభాగంలో విజేతగా కార్తికేయ మహర్షి (రంగారెడ్డి), పబ్బు శివన్స్ (మేడ్చల్ మల్కాజ్‌గిరి), రన్నర్‌గా రామ్‌చరణ్ తేజ ఆకుల (మేడ్చల్ మల్కాజ్‌గిరి), శౌర్యప్రతాప్‌సింగ్ (మేడ్చల్ మల్కాజ్‌గిరి), మూడో స్థానంలో అద్విత్ సత్తు (వికారాబాద్), మక్కి సుహిత్ యాదవ్ (రంగారెడ్డి), నాలుగో స్థానంలో అభిషిక్త్ (కరీంనగర్), కుంజుల జస్ప్రీత్ (వరంగల్) నిలిచారు. బాలికల విభాగంలో విజేతగా ఆభా జాదవ్ (రంగారెడ్డి), దియ ఆనంద్ (వికారాబాద్), రన్నర్‌గా దీక్ష సహస్ర బండ (మహబూబ్‌నగర్), నిమ్మ శాన్వి (సంగారెడ్డి), మూడో స్థానంలో కే.త్రినిత్విత (వికారాబాద్), గాదె అన్విరెడ్డి (సూర్యాపేట) నిలిచారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలో ఆదివారం నిర్వహించిన 6వ రాష్ట్రస్థాయి యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు కవిత, కీర్తన, సుప్రజ, సృజన వివిధ విభాగాల్లో పతకాలు సాధించారు. రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించడంతో మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, సాయికుమార్, కోశాధికారి సురేష్ అభినందించారు.

అబాస్‌కు వి'ముఖం'

(5వ పేజీ తరువాయి)


అబాస్‌లో హాజరు నమోదు చేస్తున్న స్టాఫ్ నర్సు

అబాస్ ద్వారా హాజరు వేసుకుంటున్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లాలో..

ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆసుపత్రుల్లో సూపరింటెండెంట్లు, మెడికల్ ఆఫీసర్లు 'అబాస్' అమలును పట్టించుకోవడం లేదన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. తప్పనిసరిగా అబాస్ ప్రకారం హాజరు నమోదు చేసుకునేలా పట్టుబడితే తప్ప పూర్తి స్థాయిలో అమలయ్యే అవకాశం లేదు. కానీ వారు ఉద్యోగులను ఏమీ అనలేక పోతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని డీఎంఈ పరిధిలో ఉన్న మెడికల్ కళాశాల, జనరల్ ఆసుపత్రులలో పనిచేసే ఉద్యోగుల వివరాలు ఇప్పటి వరకు 'అబాస్'లో నమోదు చేయలేదు. మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాలు మినహాయించి, మిగతా మూడు జిల్లాల్లో అబాస్ విధానం సక్రమంగా అమలు కావడం లేదు.

సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్న బీజేపీ

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సాగర్



జిల్లా కేంద్రంలో సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సాగర్

నాగర్‌కర్నూల్‌టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని హిందు, ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా వక్రీకరిస్తూ ప్రజల మధ్య చిచ్చుపెడుతున్న బీజేపీ నైజాన్ని తిప్పికొట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సాగర్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలో సీపీఎం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ఏ మాత్రమూ సంబంధం లేని బీజేపీ పోరాటంలో మేమున్నామంటూ వక్ర భాష్యాలు చెప్పడం సరైన పద్ధతి కాదన్నారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భూస్వా ములకు, జమీందారులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటమని, బీజేపీ మాత్రం హిందువులు, ముస్లింల మధ్య జరిగిన పోరాటమని తప్పుడు సంకేతమిస్తూ ప్రజల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఒకరు విద్రోహమని, మరొకరు విమోచనమని వాస్తవాలను వక్రీకరిస్తున్నారని, కానీ నిజమైన సాయుధ పోరాటం విలీనమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శ్రీనివాస్, బి.ఆంజనేయులు, దేశ్యానాయక్, ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు నరసింహ, రామయ్య, శంకర్‌నాయక్, అశోక్, దశరథం, తారాసింగ్, నాగరాజు, మధు, కురుమయ్య, మల్లికార్జున్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నర్వ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు సెప్టెంబరు 20 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని నర్వ మండల టీవోఎస్ఎస్ కోఆర్డినేటర్ రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 7వ తేదీ నాటికి చివరి గడువు ఉండగా 20 వరకు అపరాధ రుసుముతో గడువు ఉంటుందన్నారు. టెన్త్ పరీక్షకు వారు గతంలో చదివిన బోనఫైడ్, రికార్డు షీట్, ఇంటర్ పరీక్షకు పదో తరగతి పాస్ అయిన సర్టిఫికెట్ ఉండాలని తెలిపారు. దీంతో పాటు కుల, ఆధార్ కార్డు, రెండు ఫొటోలు జత చేయాలని తెలిపారు. ఒకే ఏడాదిలో పూర్తి చేసుకునే వెసులుబాటు ఉంటుందని, పదోన్నతులు, ఇతర ఉన్నత విద్యా అవకాశాల కోసం అవసరమైన వారికి ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు.

నేడు మిలాద్ ఉన్ నబి ర్యాలీ

నారాయణపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కేంద్రంలో సోమవారం మిలాద్ ఉన్ నబి ర్యాలీ ఉదయం పదిగంటలకు లాల్‌మజీద్ నుంచి ప్రారంభమౌంతుందని బువ్వమ్మగుట్ట దర్గా పీఠాధిపతి హజ్రత్ సయ్యద్ షా గయాసోద్దీన్ ఖాద్రీ, మిలాద్ ఉన్ నబి కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ సలీం తెలిపారు. ఈ ర్యాలీ మక్కమజీద్ మీదుగా మాసుమల్లి దర్గా, ఊట్కూర్ అసుర్‌ఖాన్, హజాఖాన్ పేట్ నుంచి సరాఫ్ బజార్ నుంచి బువ్వమ్మగుట్ట దర్గాకు చేరుకుంటుందన్నారు. ఈ ర్యాలీలో ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మిలాద్ ఉన్ నబి ర్యాలీ శాంతియుతంగా జరుపుకోవాలి
- ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ రోజు జరుపుకుబోయే మిలాద్ ఉన్ నబి పండుగ ర్యాలీని శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్పీ యోగేష్‌గౌతమ్ తెలిపారు. ర్యాలీని శాంతియుతంగా, సామరస్యంగా నిర్వహించుకోవాలని, ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా, పోలీస్ పికెట్‌ను, అందుకు పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సోషల్‌మీడియాలో ఇతర మతాలను కించపరిచే విధంగా అనుచిత పోస్టులు పెట్టరాదని, అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

గణేష్ నిమజ్జనోత్సవం విజయవంతం పట్ల హర్షం

నారాయణపేట న్యూటౌన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కేంద్రంలో శుక్ర, శనివారాల్లో జరిగిన వినాయక నిమజ్జనోత్సవాలు శాంతియుతంగా జరిగినందుకు అందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు గణేష్ ఉత్సవ సమితి కార్యదర్శి మిర్చి వెంకటయ్య, విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ కమిటీలు వేర్వేరు ప్రకటనల్లో తెలియజేశారు. భక్తులకు, మంటపాల నిర్వాహకులకు, పోలీసు విద్యుత్, మునిసిపల్ అధికారులతో పాటు ఆయా శాఖల అధికారులకు, సహకరించిన స్వచ్ఛంద సంస్థలకు అందరికి పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు.

వాడుముఖం పట్టిన పత్తి పంట



మాగనూరు శివారులో ఎండుతున్న పత్తి పంట

మాగనూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గత పది రోజుల నుంచి వర్షాలు లేక పోవడంతో రైతులు పొలంలో పండించుకుంటున్న పత్తి పంట వాడుముఖం పట్టి ఎండిపోతుందని మండల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆగస్టు నెలలో ఏకధాటిగా కురిసిన వర్షానికి పంట పైరు వేసుకున్నంత స్థాయిలో ఏపుగా పెరగలేదని దిగాలుతో ఉన్న సమయంలో మరో దెబ్బ ఇప్పుడు వర్షాలు లేక పత్తి పంట పూత, పిందే, పత్తి పగులుతున్న సమయంలో వర్షాలు లేకపోవడం చాలా బాధాకరంగా ఉందన్నారు. వర్షం కురిస్తే పంట చేతికి వస్తుందని, వర్షం రాకపోతే పంట ఎండిపోయి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు తెలిపారు. పంట పెట్టుబడి కోసం అప్పులు చేసి ఎకరానికి 15 నుంచి 20 వేల వరకు పెట్టుబడి పెట్టడం జరిగిందన్నారు. వర్షాలు లేకపోతే పెట్టిన పెట్టుబడి కూడా చేతికి రావడం కష్టమన్నారు. ఒకపక్క అతి వృష్టి, అనావృష్టి వల్ల పంటలు ఎండిపోతున్నాయని రైతులు దిగాలుతో తమ ఆవేదన వ్యక్తం చేశారు.

కొమ్మూర్‌లో సమస్యల కుప్ప

- అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇబ్బందులు
- పాఠశాల గదుల పైకప్పు నుంచి లీకవుతున్న వర్షపు నీరు
- అందుబాటులోకి రాని నూతన పంచాయతీ భవనం
- పారిశుధ్య పనులు అంతంత మాత్రమే



కొమ్మూర్‌లో రోడ్లపై నిలిచిన డ్రైనేజీ



గుంతలుగా మారిన సీసీ రోడ్డు

కోస్గి రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గుండుమాల్ మండల పరిధిలోని కొమ్మూర్ గ్రామంలో పలు సమస్యలు కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి. గ్రామంలో పది వార్డుల్లో కలిపి దాదాపు మూడు వేల జనాభా ఉంది. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపై పారి ఇళ్ల మధ్య నిల్వ ఉండడంతో దోమలు, ఈగలకు నిలయాలుగా మారింది.

పలు కాలనీలలో సీజనల్ వ్యాధులతో పిల్లలు, పెద్దలు బాధ పడుతున్నారు. వీధి లైట్లు వెలుగక పోవడంతో రాత్రి సమయాల్లో బయటికి రావడానికి భయంగా ఉందంటూ ప్రజలు వాపోతున్నారు. పారిశుధ్య చర్యలు చేపట్టక పోవడంతో గ్రామంలో మురుగు నీరు వర్షపు నీటితో కలిసి రోడ్లపై పారడంతో పిల్లలు, వృద్ధులు నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. సీసీ రోడ్లు గుంతలుగా మారి వాహనాల రాకపోకలకు కష్టాలు ఎదుర్కొంటున్నట్లు వాహనదారులు చెబుతున్నారు.గ్రామంలో ప్రాథమిక పాఠశాల భవనంలోనే ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేశారు. పీఎస్‌లో 102 మంది విద్యార్థులు ఉండగా, హెచ్ఎస్‌లో 70 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాల భవనం పాతది కావడంతో ఇటీవల కురిసిన వర్షానికి వర్షపు నీరు గదుల్లోకి చేరడంతో పీఎస్ విద్యార్థులకు కేవలం రెండు గదుల్లోనే పాఠాలు బోధిస్తున్నారు. గ్రామంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అద్దె భవనాల్లోనే కొనసాగిస్తున్నారు. కొత్త భవనాలు అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు.



అధికారుల నిర్లక్ష్యంతో ఏళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోని కొత్త పంచాయతీ భవనం

గ్రామ పంచాయతీ భవనం కొత్తగా నిర్మించినప్పటికీ కాంట్రాక్టర్‌కు బిల్లు రాకపోవడంతో ఏళ్లు గడుస్తున్న భవనం ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. ఈ మధ్యనే గ్రామ సమస్యలపై యువకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి గ్రామానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, మల్లాపూర్ గ్రామం వరకు బీటీ రోడ్డు, వాగుపై వంతెన నిర్మాణం, హై స్కూల్ భవనం, కొత్త పోస్టాఫీసు వంటి అవసరాలను తీర్చాలంటూ వినతి పత్రాన్ని అందించారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి ప్రపోజల్స్ పంపించాం

గ్రామంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. పకడ్బందీ డ్రైనేజీ నిర్మాణం కోసం కలెక్టర్‌కు నివేదిక అందించాం. త్వరలో డ్రైనేజీ నిర్మాణం కోసం చర్యలు చేపడతాం. ప్రాథమిక పాఠశాలకు అదనపు గదుల మంజూరు కోసం మండల అధికారులు పై అధికారులకు నివేదిక పంపించారు.

- కృష్ణారావు, స్పెషల్ ఆఫీసర్, కొమ్మూర్

ఘనంగా గణనాథుల నిమజ్జనం



ఆజాద్ ఉత్సవ కమిటీకి మెమెంటో అందిస్తున్న వీహెచ్‌పీ, బజరంగాదళ్ నాయకులు



నిమజ్జన ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత



మక్తల్ పెద్ద చెరువు వద్ద నిమజ్జనానికి తీసుకువెళుతున్న దృశ్యం

మక్తల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మక్తల్ పట్టణంలో ఆదివారం గణేశ్ నిమజ్జన ఊరేగింపు వేడుకలు కోలాహలంగా నిర్వహించారు. వీహెచ్‌పీ, బజరంగదళ్ ఆధ్వర్యంలో ఆజాద్‌నగర్ చౌరస్తాలో స్వాగత వేదికను మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత ప్రారంభించారు. స్వాగత వేదిక వద్ద బాలగంగాధర్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జన ఉత్సవాలు ప్రారంభించారు. వివిధ గణేశ్ ఉత్సవ కమిటీలకు వీహెచ్‌పీ, బజరంగదళ్ నాయకులు గణేశ్ ఉత్సవ కమిటీ నాయకులకు మెమొంటోలు అందించారు. పట్టణంలోని శబరికాలనీ, న్యూమారుతినగర్, రాఘవేంద్ర కాలనీ, రాంలీలా మైదానం, ఉమామహేశ్వరాలయం, కుమ్మరి వాడ, నేతాజీనగర్, వాకిటి గేరి, బ్రాహ్మణవాడ, రజకవాడ, అంబేడ్కర్‌నగర్ తదితర ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన గణనాథులను నిమజ్జనానికి తరలించారు. వివిధ గణనాథులను ప్రత్యేకంగా అలంకరించి ముస్తాబు చేశారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు నిమజ్జన ఊరేగింపు కొనసాగింది. బీకేఆర్ ఫౌండేషన్ అధినేత బాలక్రిష్టారెడ్డి భక్తులకు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు పులిహోర, మంచినీరు అందించారు. నిమజ్జన ఊరేగింపు ప్రశాంతంగా నిర్వహించేందుకు గట్టి భద్రత ఏర్పాట్లు చేశారు. 130మంది పోలీస్ సిబ్బందితో సీఐ రాంలాల్, ఎస్సై భాగ్యలక్ష్మీరెడ్డిలు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. వీహెచ్‌పీ, బజరంగదళ్, హిందూ ధార్మిక సంఘాలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న సీఐ రాంలాల్



గణేశ్ విగ్రహ ఊరేగింపులో జనసందోహం



ప్రత్యేక పూల అలంకరణతో శబరి కాలనీ గణనాథుడు

అధ్వానంగా బీటీ రహదారి

- పట్టించుకోని అధికారులు



అధ్వానంగా మారిన మక్తల్, అనుగొండ రహదారి

మక్తల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మక్తల్-అనుగొండ బీటీ రోడ్డు అధ్వానంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గత కృష్ణా పుష్కరాల సమయంలో అప్పటి గుత్తేదారు నాసీరంగా పనులు నిర్వహించడంతో కొన్ని రోజులకే రహదారి గోతులు పడి అధ్వానంగా మారింది. రోడ్డు పనులు చేపట్టిన తర్వాత ఉన్నతాధికారుల పరిశీలన సక్రమంగా లేకపోవడంతో ఎవరూ పట్టించుకోవడం లేదు. ఖానాపూర్, కర్ని, చిట్యాల, పంచదేవ్‌పహాడ్, పంచలింగాల, దాదన్‌పల్లి, ముస్లాయిపల్లి, అంకెన్‌పల్లి, అనుగొండ, పారేవుల తదితర గ్రామాలకు వెళ్లే ద్విచక్ర వాహనదారులు, పాదచారులు నిత్యం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గోతుల్లోపడి ప్రమాదాలు సంభవిస్తున్నా కనీసం మరమ్మతు పనులు, ప్యాచ్‌వర్క్‌లు చేపట్టడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారికి మరమ్మతులు చేపట్టాలి

ఏళ్ల కాలంగా బీటీరోడ్డుకు మరమ్మతులు చేపట్టకపోవడంతో రహదారి అధ్వానంగా మారింది. మక్తల్ నుంచి కర్ని, చిట్యాల మీదుగా అనుగొండకు నిత్యం వందలాది వాహనాలు వచ్చిపోతుంటాయి. రహదారి ప్రమాదభరితంగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వెంటనే రహదారికి మరమ్మతులు చేపట్టాలి.

- విష్ణువర్ధన్‌రెడ్డి, మక్తల్

శిలాఫలకానికే పరిమితం

- అంగన్‌వాడీ భవనాల పరిస్థితి

కృష్ణ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ భవనాల నిర్మాణం శిలాఫలకానికే పరిమితమైందని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. స్వంతంగా లేక అద్దె భవనంలో కేంద్రాలు నడుస్తున్నాయి. ఈ విషయం దృష్టిలో పెట్టుకుని నూతన అంగన్‌వాడీ భవనాల నిర్మాణం కోసం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కృషి మేరకు మండల కేంద్రంతో పాటు తంగడిగి గ్రామానికి ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చెరో 12 లక్షలు మంజూరు చేసి హంగు ఆర్భాటాలతో డిసెంబరు నెలలో శిలాఫలకాన్ని ప్రారంభించారు. 8 నెలలు గడుస్తున్నా నేటికీ తంగడిగి గ్రామంలో గుంతలు తవ్వి వదిలివేశారు. మండల కేంద్రంలోని ఎంపీఎస్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ఎటువంటి అంగన్‌వాడీ నిర్మాణం పనులు ప్రారంభం చేయకపోవడంతో ఆయా గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 8 నెలలు గడుస్తున్నా ఎలాంటి పనులు చేపట్టలేదు. దీంతో ఇంకెన్నాళ్లకు పనులు ప్రారంభిస్తారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలం గడిచినా, వర్షకాలం గడుస్తున్నా అద్దె భవనం ఉన్నా రేకుల షెడ్డులో ఇబ్బందులు పడుతున్నారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే నూతన అంగన్‌వాడీ భవనం పనులు ప్రారంభం చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ రాజ్ శాఖ ఏఈ మారుతితో ఆదివారం 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు ఎవరూ ముందుకు రాకపోవడం వల్ల ఆలస్యం అయిందని తెలిపారు. ఇదే విషయం మంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. త్వరలోనే వేరే ఏజెన్సీ వారికి పనులు అప్పగించి అంగన్‌వాడీ పనులు ప్రారంభం చేస్తామని వారన్నారు.



ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించిన శిలాఫలకం



కృష్ణలో అద్దె భవనంలో అంగన్‌వాడీ కేంద్రం

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాగూరావు నామాజీ

నారాయణపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పేదలు, మధ్య తరగతి ప్రజలు, రైతులకు మేలు చేసే విధంగా జీఎస్టీ స్లాబులను మదించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం నారాయణపేట జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యుడు నాగూరావు నామాజీ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం, జీఎస్టీ మండలి కమిటీ తీసుకువచ్చిన మదింపుతో దేశంలో పేదలు, మధ్య తరగతి ప్రజలు, రైతులకు పెద్ద ఊరట లభించిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో అట్టడుగు ప్రజలకు లాభం చేకూరుతుందని, అంత్యోదయ పాలనకు పునాదులు పటిష్ఠం అయ్యాయని అన్నారు.

బీజేపీ నాయకులు సిద్ది వెంకట్ రాములు, రఘు రామయ్య గౌడ్, రఘువీర్ యాదవ్, నందు నామాజీ, మిర్చి వెంకటయ్య, కృష్ణ, పోషల్ వినోద్, శ్రీనివాస్ రెడ్డి, సత్య రఘుపాల్, రమేష్, విజయ్, సైదప్ప, చలపతి, కుర్వ శ్రీను, బాబు, మణికంఠ, కిరణ హన్మంత్‌రావు, ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సరిపడా యూరియా అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర నాయకుడు బి.రాము

నారాయణపేట టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడా యూరియా అందించాలని ఏఐయూకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.రాము అన్నారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో ఆదివారం భగత్ సింగ్ భవన్‌లో ఏఐయూకేఎస్ జిల్లా కమిటీ అధ్యక్షుడు భగవంత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు సరిపడా యూరియా అందించడంలో విఫలమైందన్నారు. వెంటనే రైతులకు యూరియా అందించాలని డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలన్నారు. ఇందుకు వ్యతిరేకంగా ఈ రోజు జిల్లా కేంద్రంలో దర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి యాదగిరి, ఉపాధ్యక్షులు వెంకట్‌రెడ్డి, కొండా నర్సిములు, సహాయ కార్యదర్శి బి.నారాయణ, ఎ.రాములు, కోశాధికారి కృష్ణ, వెంకటేష్, అంజి, తాయప్ప, చంద్రాములు తదితరులు పాల్గొన్నారు.

బిజ్వార్, అవుసులోన్‌పల్లిలలో కరపత్రాలతో ప్రచారం



బిజ్వార్‌లో యూరియా అందివ్వాలని కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ఊట్కూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియాను ఇవ్వాలని కోరుతూ ఆదివారం మండలంలోని బిజ్వార్, అవుసులోన్‌పల్లి గ్రామాల్లో ఏఐయేకేఎస్ ఆధ్వర్యంలో కరపత్రాల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకుడు చెన్నప్ప మాట్లాడుతూ రాష్ట్రం వాటాగా రావాల్సిన 9.80 లక్షల మెట్రిక్ టన్నులలో కేవలం 5.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను మాత్రమే కేంద్రం సరఫరా చేసిందని అన్నారు. దాని కారణంగా రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని అన్నారు. ఈసారి రైతులు పత్తి, వరి, మొక్కజొన్న పంటలను అధిక శాతంలో సాగు చేశారని అన్నారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. నాయకులు మల్లేష్, ఎల్లప్ప, హనుమంతు, బాలప్ప, తదితరులు పాల్గొన్నారు.

నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకానికి

అనుమతులు ఇప్పించాలి

- జలసాధన సమితి జిల్లా కోకన్వీనర్ హెచ్.నరసింహ



బిజ్వార్ సమావేశంలో మాట్లాడుతున్న హెచ్. నరసింహ

ఊట్కూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా రైతులకు సాగునీరు. తాగు నీరును అందించే నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకానికి అన్ని రకాల అనుమతులను ఇప్పించడానికి కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు కృషి చేయాలని జల సాధన సమితి జిల్లా కోకన్వీనర్ హెచ్. నరసింహ అన్నారు. ఆదివారం బిజ్వార్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌లో వేసిన కేసులను వెంటనే విచారించి అనుమతులు ఇప్పించాలని కోరారు. సీఎం, మంత్రులు సైతం కాలయాపన చేయకుండా యుద్ధప్రాతిపదికన పనులను పూర్తి చేయాలని కోరారు. రైతులు చిన్ననర్సిములు, కుర్మప్ప, కిష్టప్ప, మహేష్, గోవిందురాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ధాన్యం తొలగింపు

- రోడ్డుపైనే ధాన్యం ఆరబోత కథనానికి స్పందించిన పోలీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



నిడ్జింత శివారులో రోడ్డుపై ఆరబోసిన ధాన్యాన్ని తొలగిస్తున్న పోలీసులు

కొత్తపల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): 'రోడ్డుపైనే ధాన్యం ఆరబోత' అనే కథనానికి ఆదివారం పోలీసులు స్పందించారు. రోడ్డుపై ఆరబోసిన ధాన్యాన్ని తొలగించారు. నిడ్జింత గ్రామ శివారులో కొత్తపల్లి మద్దూరు రోడ్డుపై కొంత మంది రైతులు పండించిన పంటను వేస్తున్నారు. రోడ్డు గుండా వెళ్లే ప్రయాణికులకు రాత్రి వేళలో ధాన్యం కుప్పలపై నల్ల కవర్లు కప్పడం వల్ల ద్విచక్ర వాహనదారలు ప్రమాదాలకు గురౌతున్నారు. దీనిపై ప్రచురితమైన కథనానికి పోలీసులు స్పందించి ఆరబోసిన ధాన్యాన్ని తొలగించి వారికి అవగహన కల్పించారు. దీంతో ఆ రోడ్డు గుండా వెళ్లే ప్రయాణికులు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.